సాక్షి
కుమురం భీం
శుక్రవారం । 31 । మే । 2024



వేగంగా కుట్టేస్తున్నారు!
కెరమెరి మండలంలో విద్యార్థులకు యూనిఫాంలు కుట్టేందుకు పది క్లస్టర్లు ఏర్పాటు చేశారు. మహిళా సంఘాల సభ్యులు స్టిచ్చింగ్ పనులు వేగవంతం చేశారు. 9లో▸



చినుకు పడితే చీకటే..
అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. చిన్నపాటి గాలివానకే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. గంట తరబడి కరెంట్ నిలిచిపోతోంది. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
43.2 /32.3
ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. ఉదయం నుంచే వేడి ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కుంచవెల్లి @ 46.6 డిగ్రీలు

కౌటాల(సిర్పూర్): రోహిణి కార్తె ఎండలు తీవ్ర రూపం దాల్చాయి. జిల్లాలో రికార్డుస్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా గురువారం దహెగాం మండలం కుంచవెల్లిలో 46.6 డిగ్రీల సెల్సియస్‌గా రికార్డులకు ఎక్కింది. కాగజ్‌నగర్‌లో 46.5 డిగ్రీలుగా నమోదు కాగా.. వాంకిడిలో 45.3 డిగ్రీలు, ఆసిఫాబాద్ 45.1, రెబ్బెన మండలం వంకులం 45.0, కెరమెరి మండలం ధనోరా 45.0, కౌటాల 44.9, తిర్యాణి 44.8, సిర్పూర్(టి) 44.7, రెబ్బెనలో 44.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. తీవ్రమైన వేడి, ఉక్కపోతతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావడం లేదు. కుంచవెల్లి, కాగజ్‌నగర్, వాంకిడి, ఆసిఫాబాద్, వంకులం, ధనోరా ప్రాంతాలు వార్నింగ్ జోన్‌లో ఉండగా.. మిగతా ప్రాంతాలు అలర్ట్ జోన్‌లో కొనసాగుతున్నాయి. అన్ని మండలాల్లో 40 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం కలవరపరుస్తోంది.

పెండింగ్ రెమ్యూనరేషన్లు చెల్లించాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల విధులు నిర్వర్తించిన అధ్యాపకులకు రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ రెమ్యూనరేషన్లు వెంటనే చెల్లించాలని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2022- 23, 2023- 24 విద్యా సంవత్సరాలకు సంబంధించిన పారితోషికం పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. నిధులు విడుదల చేయని పక్షంలో మూల్యాంకన కేంద్రాల ఎదుట దశలవారీగా నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు.

అత్యవసర వైద్య సేవలపై ముగిసిన శిక్షణ



అత్యవసర వైద్యంపై శిక్షణ అందిస్తున్న శిక్షకులు

మంచిర్యాలటౌన్: 108అంబులెన్స్‌ల్లో పని చేస్తున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు, పైలెట్లకు నాలుగు రోజులు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో అత్యవసర వైద్య సేవలపై అందిస్తున్న శిక్షణ గురువారం ముగిసింది. రాష్ట్ర 108 సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా 108 అంబులెన్స్ వాహనాల ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, మంచిర్యాల జిల్లా కార్యనిర్వహణాధికారి సంపత్ సమక్షంలో శిక్షకులు గజేందర్, సుమన్ అత్యవసర వైద్యం, మెలకువలపై శిక్షణ అందించారు. 108 వాహనం ద్వారా తరలిస్తున్న సమయంలో అత్యవసరమైన వైద్య సేవలు అందించే వీలుంటుందని శిక్షకులు తెలిపారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు, పైలట్లు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న డీపీవో భిక్షపతిగౌడ్

బెజ్జూర్(సిర్పూర్): నర్సరీల్లోని మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. బెజ్జూర్ మండలం కుశ్నపల్లి పంచాయతీలోని నర్సరీతోపాటు శ్మశానవాటిక, డంపింగ్ యార్డులను గురువారం తనిఖీ చేశారు. డీపీవో మాట్లాడుతూ ఎండల నేపథ్యంలో నర్సరీలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మొక్కలు చనిపోకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, చనిపోయిన వాటి స్థానంలో కొత్తవి నాటాలని సూచించారు. గ్రామాల్లో చెత్త సేకరణ చేపట్టాలన్నారు. ఆయన వెంట ఎంపీవో రమేశ్‌రెడ్డి ఉన్నారు.

వేడుకల్లో అంబేద్కర్‌కు నివాళులర్పించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ కోరారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న రాష్ట్రాలతోనే ప్రతీ గ్రామం బాగుపడుతుందని రాజ్యాంగంలో పొందుపర్చడంతోనే ప్రత్యేక తెలంగాణ సిద్ధించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వేడుకల్లో అంబేద్కర్ చిత్రపటాలతోపాటు విగ్రహాలకు నివాళులర్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రాజయ్య తదితరులు ఉన్నారు.

తనిఖీలు శూన్యం..!



- జిల్లాలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లు
- రెగ్యులర్ ఫుడ్ సేఫ్టీ అధికారి లేక పర్యవేక్షణ కరువు
- రోజుల తరబడి నిల్వ చేసిన పదార్థాలు, రసాయనాల వినియోగం
- నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

ఆసిఫాబాద్: హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లో ఇటీవల ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ తరుణంలో చాలాచోట్ల బిర్యానీ, ఇతర ఆహార పదార్థాల తయారీకి కుళ్లిన మాంసం, గుడ్లు, కూరగాయలు, నాసిరకం వస్తువులు వినియోగిస్తున్నట్లు వెలుగులోకి రావడం కలకలం రేపింది. అయితే కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మాత్రం ఇప్పటివరకు తనిఖీల ఊసే లేదు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. రోజురోజుకు పెరుగుతున్న జనాభా, ప్రజల అవసరాలకు అనుగుణంగా పుట్టగొడుగుల్లా హోటళ్లు వెలుస్తున్నాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఇవి కనీస నిబంధనలు, నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. నిర్వాహకులు నాసిరకం ఆహార పదార్థాలు, మాంసం కూరగాయలతోపాటు వాడిన నూనెలు మళ్లీ మళ్లీ వినియోగిస్తూ ప్రజల జీవితాలను డేంజర్‌లో పడేస్తున్నారు. కల్తీ ఆహార పదార్థాలతో చాలా మంది రోగాల బారిన పడుతున్నారు.

హోటల్, స్ట్రీట్ ఫుడ్‌కు మొగ్గు
పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతన జిల్లాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆసిఫాబాద్ పట్టణం జిల్లా కేంద్రంగా మారడంతో ఇక్కడ ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర ప్రాంతాల నుంచి వివిధ అవసరాల కోసం వచ్చిన వారితో జనాభా గణనీయంగా పెరిగింది. ఇతర ప్రాంతాల నుంచి పనుల కోసం వచ్చే వారు, చదువు, ప్రైవేట్ ఉద్యోగాలు చేసే బ్యాచిలర్లు తప్పనిసరి బయట తినాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అలాగే వారాంతాల్లో చిన్నారులతో కలిసి వెళ్లే వారి సంఖ్య కూడా పెరిగింది. ఆహారం వ్యాపారం లాభసాటిగా ఉండడంతో ఆసిఫాబాద్ పుట్టగొడుగుల్లా హోటళ్లు, రెస్టారెంట్లు వెలిశాయి. మరో వైపు కాగజ్‌నగర్ పట్టణంలోనూ ఇలాంటి పరిస్థితే ఉంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో మినీ ఇండియాను తలపించే ఈ పట్టణంలోనూ 'రెస్టారెంట్' సంస్కృతి విస్తరిస్తోంది. టిఫిన్లు, ఫాస్ట్ ఫుడ్‌సెంటర్లు, వెజిటేరియన్, నాన్ వెజిటేరియన్ హోటళ్లు, బిర్యానీ సెంటర్లు, మండీలు, స్వీట్ హౌజ్‌లు, కర్రీ పాయింట్లు, మిర్చి బండ్లు, గప్‌చుప్ బండ్లతోపాటు విస్తృతంగా బేకరీలు వెలిశాయి. జిల్లాలో సుమారు 500 వరకు హోటళ్లు, రెస్టారెంట్లు ఉంటాయని అంచనా.

పర్యవేక్షణ కరువు..
హోటళ్లు, రెస్టారెంట్లపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు, మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. జిల్లాకు రెగ్యులర్ ఫుడ్ సేఫ్టీ అధికారి లేకపోవడంతో ఏళ్లుగా ఇన్‌చార్జీలతోనే నెట్టుకొస్తున్నారు. ఆదిలాబాద్ ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రస్తుతం జిల్లా ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో పర్యవేక్షణ కొరవడి చాలాచోట్ల హోటళ్లలో శుచీ శుభ్రత పాటించడం లేదు. వర్షాకాలంలో మరింత అధ్వానంగా మారుతున్నాయి. ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ నిబంధనల ప్రకారం ఆహార పదార్థాల ఉత్పత్తి, ప్యాకింగ్, రవాణా, విక్రయం, వినియోగం వరకు ఎక్కడ కల్తీ లేకుండా నిఘా ఉండాలి. ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ సమయంలో సేకరించిన శాంపిళ్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపాలి. కేవలం ఆదాయమే ధ్యేయంగా ఈ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఇటీవల కాలంలో జిల్లాలో ఎక్కడా హోటళ్ల తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో వారికి అడ్డూఅదుపు లేకుండా పోయింది. రెస్టారెంట్లలో ఇష్టారాజ్యంగా ధరలు పెంచడంతో వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి.

కల్తీ ఆహారం.. అనారోగ్యానికి మూలం
మటన్, చికెన్, కోడిగుడ్లతో పాటు కూరగాయలు ఫ్రిజ్‌లో రోజుల తరబడి నిల్వ ఉంచడం, ఆహార పదార్థాలు, కాలం చెల్లిన మసాలాల వినియోగం ప్రజల పాలిట శాపంగా మారుతోంది. కల్తీ, నాణ్యత లేని ఆహారంతో జీర్ణకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. రుచి కోసం వాడే కలర్లతో కాన్సర్ వంటి భయంకర వ్యాధుల విజృంభించే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు. కాచిన నూనెను పదే పదే వాడటం వల్ల అనారోగ్యం కొని తెచ్చుకోవడమేనని వారు పేర్కొంటున్నారు. ఈ కారణంగానే జిల్లాలో ఇటీవల గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ గ్యాస్ట్రిక్ సమస్యలు వెలుగులోకి రావడం సమస్యకు అద్దం పడుతోంది.

కల్తీ ఆహారంతో వ్యాధులు

కల్తీ ఆహారం, రుచి కోసం వాడే రసాయనాలతో వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో వాడిన నూనెను మళ్లీ మళ్లీ వాడడం క్యాన్సర్ కారకమవుతుంది. ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లలో రోజుల తరబడి నిల్వ ఉంచిన మటన్, చికెన్ ఆహార పదార్థాలను వినియోగించొద్దు. ప్రజలు వీలయినంత వరకు బయట తినడం తగ్గించాలి. ఆరోగ్య సూత్రాలు పాటిస్తే అందరికి మేలు.

– డాక్టర్ సుధాకర్‌నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఎమ్మార్పీకే విత్తనాలు విక్రయించాలి

- నకిలీవి అమ్మితే కఠిన చర్యలు
- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: వ్యాపారులు ఎమ్మార్పీకే రైతులకు విత్తనాలు విక్రయించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రావూరి శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావుతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ, లూజు విత్తనాలు విక్రయిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఈ ఏడాది వానాకాలం సాగు 4.42 లక్షల ఎకరాలు ఉండగా, 3.38 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగవుతుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. జిల్లాలో పత్తి విత్తనాల కొరత లేదని, డీలర్ల వద్ద సరిపడా స్టాకు ఉందన్నారు. పత్తి సాగుకు 7 లక్షల ప్యాకెట్ల విత్తనాలు అవసరం ఉండగా.. 5 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు లైసెన్స్‌డ్ డీలర్ల నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలని, విధిగా బిల్లులు తీసుకొని, ఖాళీ విత్తన సంచులు ఏడాది వరకు భద్రపరచుకోవాలని సూచించారు. డీలర్లు తమ షాపులో అందుబాటులో ఉన్న విత్తనాల నిల్వలు, ధరల పట్టికను స్టాక్ బోర్డుపై కంపెనీల వారీగా ప్రదర్శించాలన్నారు. జిల్లాలో నకిలీ విత్తనాలను నియంత్రించేందుకు రెండు డివిజన్లలో పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు రూ.26.50 లక్షల విలువ చేసే 1000 కిలోల పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకుని, ఏడుగురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. నకిలీ, లూజు విత్తనాలు విక్రయం, అక్రమ రవాణా, అధిక ధరలు, నాసిరకం విత్తనాలు విక్రయిస్తే రైతులు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నం.6304686505కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనంతరం అదనపు ఎస్పీ మాట్లాడుతూ నకిలీ విత్తనాల అక్రమ రవాణా నియంత్రించేందుకు జిల్లాలో టాస్క్‌ఫోర్స్ టీంలు పని చేస్తున్నాయని తెలిపారు. నాసిరకం విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్టు ప్రయోగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో డీఎస్పీ సదయ్య, డీపీఆర్వో సంపత్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



వివరాలు తెలుసుకుంటున్న పీవో ఖుష్బూ గుప్తా

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మండలంలోని అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. ఓపీ, రోగులు, మందుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. పీహెచ్‌సీ సిబ్బంది నిత్యం రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. వర్షాకాలంలో అన్నిరకాల సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులతోపాటు పాముకాటు వ్యాక్సిన్లు తెప్పించుకోవాలన్నారు. ఏఎన్ఎంలు, ఆస్పత్రి సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్, సెలవుల రికార్డు సక్రమంగా నిర్వహించని పీహెచ్‌సీ వైద్యాధికారి వినోద్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

కార్మిక సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న రాములు

కాగజ్‌నగర్‌రూరల్: సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం సాగిస్తామని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం జిల్లా ఉపాధ్యక్షురాలు త్రివేణితో కలిసి జెండా ఆవిష్కరించారు. అనంతరం స్థానిక విశ్రాంత భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా, వైద్య రంగాలను ప్రైవేట్ పరం చేయడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పోరాడి సాధించుకున్న చట్టాలను కార్పొరేట్ల కోసం ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయని ఆరోపించారు. స్కీంవర్కర్లను ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, కార్యదర్శి పద్మ, సహాయ కార్యదర్శి శంకర్, సహ కార్యదర్శి కృష్ణమాచారి, కమిటీ సభ్యులు మోరేశ్వర్, నగేశ్, పద్మ, సురేఖ, మోతుబాయి, స్వరూప, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో స్కూళ్లు ప్రారంభం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: పండుగ వాతావరణంలో ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఈవో అశోక్, డీఆర్‌డీవో సురేందర్, మండల సమాఖ్య సంఘాల సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 3 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం కొనసాగుతుందన్నారు. బడీడు, బడి బయట, బడి మానేసిన పిల్లలను గుర్తించి ఉపాధ్యాయులు బాధ్యతగా పాఠశాలలో చేర్పించాలని సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ బడులను ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఉచిత విద్యతోపాటు యూనిఫాంలు, ఉదయం బలవర్ధకమైన ఆహారం, మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అందిస్తున్నామన్నారు. గవర్నమెంట్ స్కూళ్లలో చదివిన పదో తరగతి విద్యార్థులకు ఇంటర్, ఇంజినీరింగ్ విద్య కోసం ప్రభుత్వం ఎన్నో వెసులుబాట్లు కల్పిస్తుందన్నారు. సమావేశం మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు త్రివేణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె



సమ్మె నోటీసు ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో పని చేస్తున్న ప్రైవేట్ హైర్‌బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకుంటే జూన్ 14 తర్వాత నిరవధిక సమ్మెలోకి వెళ్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో గురువారం ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్‌తోపాటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజుకు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ డిపోలో సుమారు 15 ఏళ్లుగా హైర్‌బస్సు డ్రైవర్లు పని చేస్తూ చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్రైవర్లకు రూ.26వేల వేతనం చెల్లించాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. హైర్ బస్సు డ్రైవర్లను కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్మికుల వేతనాలు పెంచి, బోనస్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ డిపో అధ్యక్షుడు దివాకర్, ప్రైవేట్ బస్ డ్రైవర్స్ యూనియన్ డిపో అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి షఫీక్, నాయకులు కృష్ణ, సంతోష్, కుమార్, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

'సీజనల్'పై ఫోకస్

- వర్షాకాలంలో విషజ్వరాల కట్టడికి జిల్లా వైద్యాశాఖ ప్రణాళికలు
- దోమల నివారణకు జూన్ నుంచి ప్రత్యేక కార్యక్రమాలు
- గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు
- పరిశుభ్రత పాటించేలా సూచనలు



బెజ్జూర్‌లో మందులు అందిస్తున్న వైద్యసిబ్బంది

ఆసిఫాబాద్‌అర్బన్: నైరుతి రుతుపవనాలు గురువారం కేరళ తీరాన్ని తాకగా.. త్వరలో రాష్ట్రంలో సైతం విస్తరించనున్నాయి. కొద్దిరోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానుంది. పల్లెలు, పట్టణాల్లోని మురుగునీటి కుంటల్లో వరద చేరి దోమల ఉధృతి పెరిగి విషజ్వరాలు విజృంభించే అవకాశం ఉంది. అలాగే జలుబు, దగ్గు, జ్వరంతోపాటు డెంగీ, మలేరియా, చికున్ గున్యా తదితర అంటువ్యాధులు వ్యాప్తి చెందుతాయి. తాగునీరు, ఆహారం కలుషితమై ఇన్‌ఫెక్షన్ బాధితులు కూడా పెరుగుతారు. ఈ తరుణంలో విషజ్వరాలను కట్టడి చేసేందుకు జిల్లా వైద్యారోగ్య శాఖ ముందస్తు ప్రణాళికతో సిద్ధమైంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వానాకాలంలో ప్రత్యేక కార్యక్రమాలతో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనుంది.

మారుమూల గ్రామాల్లో వ్యాధుల భయం
జిల్లాలోని 15 మండలాల పరిధిలో 334 గ్రామాలు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలు ఉన్నాయి. తిర్యాణి, కెరమెరి, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాలు ఏజెన్సీ ప్రాంతంలో ఉండగా.. దహెగాం, పెంచికల్‌పేట్, బెజ్జూర్, చింతలమానెపల్లి, కౌటాల మండలాల్లోని పలు గ్రామాలకు ఇప్పటికీ సరైన రహదారులు లేవు. వర్షాలకు వాగులు ఉప్పొంగితే వీరు ఆస్పత్రులకు వెళ్లడం కష్టతరమైన పని. మారుమూల గ్రామాల్లో ఏటా విషజ్వరాలతో ఒకేసారి పదుల సంఖ్యలో మంచం పడుతున్నారు. వర్షాకాలంలో ఎక్కువగా తాగునీరు, ఆహారం కలుషితం కావడంతోనే రోగాలు విజృంభిస్తుంటాయి. ఇక వసతిగృహాల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురవుతుంటారు. జిల్లాలో మలేరియా, డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. రికార్డుల పరంగా వీటితో మరణాలు లేవని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. గడిచిన మూడేళ్లలో 220 డెంగీ కేసులు, 235 మలేరియా కేసులు నిర్ధారణ అయ్యాయి. ఇక జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు చికున్ గున్యా పాజిటివ్ కేసులు నమోదు కాలేదు. ఈ ఏడాది ఇప్పటివరకు ఒక డెంగీ కేసు నమోదు కాగా.. ఏడుగురు మలేరియా బారిన పడ్డారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్యారోగ్య శాఖ ముందస్తు చర్యల ద్వారా జ్వరాల కట్టడి చేయాలని భావిస్తోంది. ప్రజలు కలుషిత ఆహారానికి దూరంగా ఉండాలని వైద్యాధికారులు చెబుతున్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచిస్తున్నారు.

అవగాహనతోనే వ్యాధుల కట్టడి

ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన ఉంటేనే సీజనల్ వ్యాధుల కట్టడి సాధ్యమవుతుంది. ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా ఆలస్యం చేయకుండా స్థానిక ఆస్పత్రుల్లో వైద్యులను సంప్రదించాలి. వ్యాధుల నివారణ, ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యసిబ్బందికి త్వరలోనే శిక్షణ అందిస్తాం. త్వరలో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలి. డ్రైడే పాటిస్తూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

– సుధాకర్‌నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

జిల్లాలో విషజ్వరాల వివరాలు

సంవత్సరం	డెంగీ	మలేరియా	మరణాలు
2014	07	520	00
2015	04	6,196	02
2016	01	713	00
2017	07	161	00
2018	17	70	00
2019	60	100	00
2020	65	78	00
2021	94	77	00
2022	40	77	00
2023	86	81	00
2024	01	07	00

జూన్ నుంచి ప్రత్యేక కార్యక్రమాలు
జిల్లాలో 22 పీహెచ్‌సీలు, రెండు సీహెచ్‌సీలు, 118 సబ్ సెంటర్లు ఉన్నాయి. ఆయా వైద్యశాలల పరిధిలో సీజనల్ వ్యాధులను అడ్డుకునేందుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని వైద్యారోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ఉండేందుకు జూన్ మొదటి వారం నుంచి ఇండోర్ రెసిడియల్ దోమల మందును ముందుగా గుర్తించిన 61 గ్రామాల్లో పిచికారీ చేస్తారు. ఈ కార్యక్రమం 45 రోజులపాటు కొనసాగనుంది. జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల సమన్వయంతో సమావేశాలు ఏర్పాటు చేస్తారు. వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తారు. ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తారు. రక్తనమూనాలు సేకరించి, వ్యాధులు నిర్ధారణ అయిన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేస్తారు. దీంతోపాటు వ్యాధుల కట్టడికి చేపట్టాల్సిన చర్యలపై వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీరు క్షేత్రస్థాయిలో వ్యాధులపై అవగాహన కల్పిస్తారు. కలుషిత ఆహారం, నీరు, దోమలతో వచ్చే వ్యాధులను అరికట్టే కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేస్తారు. పంచాయతీ, నీటి సరఫరా, గ్రామీణాభివృద్ధి శాఖలతో సమన్వయం చేసుకుంటూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు.

ఆటోపార్కింగ్ స్థలం కబ్జా..!

- స్థలం లేక డ్రైవర్ల అవస్థలు
- షెడ్ల నిర్మాణంపై స్పందించని అధికారులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జాకు గురవుతోంది. బస్తీల్లో మారుమూల ఉన్న ఖాళీ స్థలాలతోపాటు ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న భూములు, ఆటో పార్కింగ్ స్థలాలు, ప్రభుత్వ, సింగరేణి లీజు భూములు కబ్జాకు గురవుతున్నా అధికారుల పట్టింపు కరువైంది. బెల్లంపల్లి మండలానికి చెందిన పలు గ్రామాల ఆటో డ్రైవర్లతోపాటు భీమిని, కన్నెపల్లి, నెన్నెల మండలాలకు చెందిన ఆటోలకు కాంటా చౌరస్తా, కూరగాయల మార్కెట్ ముందు ఉన్న ఖాళీ స్థలాల్లో కొన్నాళ్ల క్రితం పార్కింగ్ స్థలాలుగా ఎంపిక చేశారు. రోడ్డుపై ఆటోలు నిలుపకుండా సింగరేణి భూభాగాన్ని బెల్లంపల్లి మండలంలోని పలు గ్రామాల ఆటోడ్రైవర్లు అడ్డాగా ఏర్పాటు చేసుకున్నారు. కూరగాయల మార్కెట్ పనులు ప్రారంభించిన క్రమంలో మాల గురిజాల, రంగపేట, తాళ్లగురిజాల, దుగినేపల్లి గ్రామాల ఆటో డ్రైవర్లు ఏర్పాటు చేసుకున్న పార్కింగ్ స్థలం అన్యాక్రాంతమైంది. ప్రస్తుతం ఆ భూమికి ఎనలేని డిమాండ్ రావడంతో కబ్జాదారులు ప్రభుత్వ అధికారులతో కుమ్మక్కై అనుమతి లేకుండానే షెడ్డు నిర్మాణం చేసినట్లు డ్రైవర్లు పేర్కొంటున్నారు. దీంతో ఆయా గ్రామాల ఆటోడ్రైవర్లకు పార్కింగ్ స్థలం లేకుండా పోయింది.

దిక్కుతోచని స్థితిలో ఆటో డ్రైవర్లు

పార్కింగ్ స్థలం కబ్జా కావడంతో మరోచోట పార్కింగ్ చేసే అవకాశాలు లేక రంగపేట, మాల గురిజాల, దుగినేపల్లి, తాళ్ల గురిజాల ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కన ఆటో నిలిపి ఉంచితే ట్రాఫిక్ పోలీసులు ఫైన్ వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొద్దంతా కష్టపడితే వచ్చే కొద్ది పాటి డబ్బులు ఫైన్ కట్టడానికి కూడా సరిపోవడం లేదని అంటున్నారు. కబ్జాకు గురైన విలువైన ఆటో పార్కింగ్ స్థలాన్ని తమకు తిరిగి ఇప్పించాలని నాలుగు గ్రామాల ఆటో డ్రైవర్లు గత నాలుగైదు రోజులుగా మున్సిపల్ కమిషనర్, పోలీసులకు ఫిర్యాదు పత్రాలు అందజేసి వేడుకుంటున్నారు.


పార్కింగ్ స్థలంలో నిర్మాణం చేసిన షెడ్డు

ఎంతో కష్ట పడ్డం



కాంటా చౌరస్తా, కూరగాయల మార్కెట్ పరిసరాల్లో ఆటో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని కొన్నాళ్లపాటు ఆందోళనలు చేశాం. మా కష్టాలు కళ్లారా చూసిన పోలీసు, మున్సిపల్ అధికారులు ఒక్కోచోట ఒక్కో గ్రామానికి పార్కింగ్ స్థలాన్ని ఎంపిక చేశారు. మాల గురిజాల, రంగపేట గ్రామాల ఆటో డ్రైవర్లకు కూరగాయల మార్కెట్ ముందు ఉన్న ఖాళీ స్థలాన్ని కేటాయించారు. కొన్నేళ్లు ఆటోలు పార్కింగ్ చేశాక మార్కెట్ నిర్మాణంలో భాగంగా పార్కింగ్ స్థలం కబ్జా చేశారు.
– దుర్గం నానయ్య, ఆటోడ్రైవర్

ఇబ్బందులు పడుతున్నాం



మార్కెట్ ముందు ఉన్న సింగరేణి ఖాళీ స్థలాన్ని కబ్జా చేసి షెడ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. ఆ షెడ్ల మధ్యలో ఉన్న మా పార్కింగ్ స్థలాన్నీ వదలలేదు. ఇప్పుడు మాకు పార్కింగ్ స్థలం లేకుండా పోయి మస్తు తిప్పలైతంది. నిర్దిష్టమైన పార్కింగ్ స్థలం లేక గిరాకీ కూడా సరిగా రావడం లేదు.
– సుభాష్, ఆటో డ్రైవర్

ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన


ఆర్డీవో కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు

బెల్లంపల్లి: ఆటో పార్కింగ్ స్థలంలో అక్రమ నిర్మాణాలు అడ్డుకుని వెంటనే ఆ స్థలాన్ని తమకు తిరిగి ఇప్పించాలని ఆటో డ్రైవర్లు, ఓనర్లు డిమాండ్ చేశారు. గురువారం బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపల్లి మండలం మాల గురిజాల, తాళ్లగురిజాల, రంగపేట, దుగినేపల్లి గ్రామాలకు చెందిన దాదాపు 100 మంది వరకు ఆటోలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని తెలిపారు. బెల్లంపల్లి కూరగాయల మార్కెట్ ముందు ఉన్న గడ్డ వద్ద ఆటోల పార్కింగ్ కోసం ఇరవై ఏళ్ల క్రితం మున్సిపల్, పోలీసు అధికారులు స్థలాన్ని కేటాయించారని పేర్కొన్నారు. కొందరు వ్యాపారులు ఆ స్థలంలో శాశ్వత కట్టడాలు చేపట్టి ఆటో పార్కింగ్ స్థలం లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాల గురిజాల, తాళ్లగురిజాల, రంగపేట, దుగినేపల్లి గ్రామాల ఆటో డ్రైవర్లు, ఓనర్లు, బెల్లంపల్లి ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

సిలంబం క్రీడాకారులు అభినందనీయులు


క్రీడాకారులను సన్మానిస్తున్న స్వచ్ఛంద, క్రీడా సంఘాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అంతర్జాతీయ స్థాయిలో ఆదిలాబాద్ క్రీడా పతాకాన్ని ఎగురవేసిన సిలంబం క్రీడాకారులు అభినందనీయులని తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు అన్నారు. ఈ నెల 25 నుంచి 28 వరకు మలేషియాలోని షెపాంగ్ పట్టణంలో జరిగిన అంతర్జాతీయ స్థాయి సిలంబం ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా గురువారం హాజీపూర్ మండలం వేంపల్లిలోని పద్మావతి గార్డెన్స్‌లో క్రీడాకారులను పలు స్వచ్ఛంద, క్రీడాకారుల సంఘాలు ఘనంగా సన్మానించారు. పులిశెట్టి శృతి, దొంతుల వర్ష బంగారు, రజత పతకాలు, బోను సంతోష్ రజత పతకం సాధించారు. ఈ కార్యక్రమంలో సిలంబం అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు సిరంగి గోపాల్, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సుకుమార ఫ్రాన్సిస్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాబూరావు, హ్యాండ్‌బాల్ కోచ్‌లు, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వడదెబ్బతో యువకుడి మృతి


మృతుడు కిరణ్(ఫైల్)

కాసిపేట: మండల కేంద్రానికి చెందిన సూర కిరణ్(36) బుధవారం రాత్రి వడదెబ్బతో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రెండు రోజుల క్రితం వడదెబ్బకు గురి కాగా బుధవారం రాత్రి వాంతులు అయ్యాయి. చికిత్స నిమిత్తం ఆటోలో ఆస్పత్రికి తరలిస్తుండగా ఫిట్స్ రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య నిర్మల, కూతురు అవంతిక, కుమారుడు నీరాజ్ ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య


జంగంపల్లి మల్లేశ్(ఫైల్)

నస్పూర్: శ్రీరాంపూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని కృష్ణాకాలనీకి చెందిన జంగంపల్లి మల్లేశ్ గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. జంగంపల్లి మల్లేశ్ ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. అతడికి మూడేళ్ల క్రితం సంధ్యతో వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో అతడు మద్యానికి బానిసయ్యాడు. భార్య మూడు నెలల క్రితం తన పుట్టింటికి వెళ్లింది. మల్లేశ్ బుధవారం రాత్రి అతిగా మద్యం సేవించి మద్యంలో గుర్తు తెలియని క్రిమి సంహారక మందు కలుపుకొని తాగాడు. కుటుంబ సభ్యులు గురువారం తెల్లవారుజామున చూసేసరికి మల్లేశ్(30) విగతజీవిగా కనిపించాడు. మృతుడితండ్రి సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తీరనున్న వన్యప్రాణుల దప్పిక


ముదిగుంట అటవీప్రాంతంలో ఏర్పాటు చేసిన గుంతలో నీరు

జైపూర్: మండలంలోని ముదిగుంట అటవీ ప్రాంతంలో అటవీ అధికారులు, సిబ్బంది ప్రయత్నంతో వన్యప్రాణుల దప్పిక తీరుతోంది. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ(టీజీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో నీలగిరి ప్లాంటేషన్ పెంచుతున్న అటవీ ప్రాంతం మధ్యలో నుంచి వెళ్లే చిన్నవాగులో ఒక మూలన కొద్ది పాటి నీటి కోసం వన్యప్రాణులు వస్తుంటాయి. ఎండల తీవ్రతకు నీరు అడుగంటడంతో వన్యప్రాణులు అల్లాడిపోతున్నాయి. వాగులో పక్కన గుంత తీసి పూడిక తీసే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ సురేశ్‌కుమార్, ఎంపీడీవో సత్యనారాయణ సహకారంతో ప్లాంటేషన్ వాచర్ శంకర్, కొంతమంది ఉపాధి కూలీలు శ్రమించి గుంత తీసి పూడిక తొలగించడంతో నీళ్లు వచ్చాయి.

రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యం

- సింగరేణి చైర్మన్ బలరాం

జైపూర్: రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యంగా ఉండాలని, నిర్దేశించిన లక్ష్య సాధనకు సమష్టిగా కృషి చేయాలని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం అన్నారు. గురువారం ఆయన మండలంలోని ఇందారం ఐకే–ఓసీపీని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డితో కలిసి సందర్శించారు. ఓపెన్‌కాస్టు గని వ్యూ పాయింట్, పని ప్రదేశాలు పరిశీలించి గని అధికారులు, కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులతో ఓబీ తొలగింపు, బొగ్గు ఉత్పత్తిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాకు 2024–25 ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన ఓబీ, బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను సాధించాలని అన్నారు. క్వారీలో నీరు నిల్వకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎండల నేపథ్యంలో ఉపరితల గనుల్లో ఉద్యోగులకు తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం పురుషోత్తమరెడ్డి, ఇందారం ఓపెన్ కాస్టు ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, గని మేనేజర్ రవికుమార్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్టు ఇంజనీర్ రమేశ్ పాల్గొన్నారు.


రాజు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బలరాం

కార్మికుడి కుటుంబానికి పరామర్శ

బెల్లంపల్లిరూరల్: మందమర్రి ఏరియా ఏరియా స్టోర్‌లో ఇటీవల మృతిచెందిన కాసిపేట–2 గని కార్మికుడు కర్రె రాజు కుటుంబాన్ని సింగరేణి సీఅండ్ఎండీ ఎన్.బలరాం గురువారం పరామర్శించారు. మందమర్రి ఏరియా జీఎం మనోహర్‌తో కలిసి మండలంలోని బట్వాన్‌పల్లి గ్రామంలో రాజు నివాసానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. చిన్నారిని ఎత్తుకుని లాలించారు. అన్ని రకాల టెర్మినల్ బెనిఫిట్స్ చెల్లించడానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాజు భార్యకు తొందరలోనే ఉద్యోగం వచ్చేలా చూస్తానని హామీనిచ్చారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళ మృతి

- వైద్యం వికటించిందన్న కుటుంబీకులు
- డాక్టర్, నర్సులపై పోలీసులకు ఫిర్యాదు


మృతురాలు భాగ్యలక్ష్మి(ఫైల్)

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మహిళ మృతి కలకలం రేపింది. ఇంజక్షన్ చేసిన కొద్ది నిమిషాల వ్యవధిలోనే మృతిచెందడంతో వైద్యం వికటించిందని కుటుంబ సభ్యులు గురువారం ఆందోళన చేపట్టారు. మృతురాలి భర్త మంతెన లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాల్టీ రడగంబాల బస్తీకి చెందిన భాగ్యలక్ష్మికి వాంతులు, విరేచనలు కావడంతో బుధవారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చేర్చుకున్న వైద్యులు చికిత్స అందించారు. రాత్రి 9.30గంటల ప్రాంతంలో ఇంజక్షన్ ఇవ్వడంతో నిమిషాల వ్యవధిలోనే ఆమె పరిస్థితి ఆందోళనకరంగా మారింది. సమాచారం ఇవ్వడంతో ఇంటి వద్ద ఉన్న భర్త లక్ష్మణ్ హుటాహుటిన ఆస్పత్రికి వెళ్లాడు. ఇంజక్షన్ ఇవ్వడం వల్ల భాగ్యలక్ష్మికి బ్రెయిన్ స్ట్రోక్, ఫిట్స్ వచ్చిందని, వెంటనే ఐసీయూలోకి మార్చి ఆక్సిజన్ ఎక్కించామని డ్యూటీ డాక్టర్, నర్సు చెప్పారని లక్ష్మణ్ పేర్కొన్నాడు. కడుపులో మంటగా ఉందని చెప్పినా పట్టించుకోలేదని తెలిపాడు. అపస్మారక స్థితికి చేరిన భాగ్యలక్ష్మిని వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని 108 అంబులెన్స్‌లో ఎక్కించారు. బీపీ, పల్స్ పరిశీలించి స్పందించడం లేదని మార్గమధ్యంలో నుంచి అంబులెన్స్‌ను వెనక్కి తీసుకొచ్చి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో దింపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇంజక్షన్ ఇవ్వడం వల్లే భాగ్యలక్ష్మి మృతిచెందిందని ఆస్పత్రి వద్ద గురువారం మధ్యాహ్నం వరకు ఆందోళన చేపట్టారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్, మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, కాంగ్రెస్ ఎన్నికల ప్రచార కమిటీ రాష్ట్ర సభ్యుడు న్యాతరి స్వామి, నాయకులు వాసు, దామెర శ్రీనివాస్, రామగిరి మహేష్, బడికెల రమేష్ తదితరులు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్‌తో మాట్లాడారు. మరణానికి గల కారణాలపై అడిగి తెలుసుకున్నారు. నిర్లక్ష్యంగా వైద్యం చేసిన డ్యూటీ డాక్టర్, నర్సులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని మృతురాలి భర్త లక్ష్మణ్ టూటౌన్ ఎస్సై రమేష్‌కు ఫిర్యాదు చేశాడు. కాగా, వైద్యం చేయడంలో నిర్లక్ష్యం చేయలేదని, నిబంధనల ప్రకారంగానే వ్యవహరించామని వైద్యులు పేర్కొన్నారు. వివాహిత మృతి వివాదాస్పదంగా మారడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించారు.


ఎస్సై రమేష్‌కు ఫిర్యాదు చేస్తున్న లక్ష్మణ్

సీహెచ్‌పీ డీజీఎంపై సీఎండీకి ఫిర్యాదు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ సీహెచ్‌పీ డీజీఎం డీవీ రావుపై ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్, సీనియర్ ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి గురువారం సింగరేణి సీఎండీ బలరాంకు ఫిర్యాదు చేశారు. గోదావరిఖనికి వచ్చిన సీఎండీని సింగరేణి గెస్ట్‌హౌజ్‌లో కలిశారు. సాప్లింగ్ మజ్దూర్లను షిఫ్టులు మారుస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్న కార్మికులపై సానుభూతి చూపకుండా జనరల్ షిఫ్ట్ నుంచి షిఫ్టులకు మారుస్తున్నారని తెలిపారు. డ్రైవర్ల ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు ఆపి వేస్తున్నారని, కార్మికులకు సరైన రెస్టరూమ్స్ లేవని, స్కూటర్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రశ్నించిన వారికి చార్జీషీట్లు ఇస్తూ సస్పెండ్ చేస్తున్నారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాగా, ఇదే విషయమై శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, జాతీయ సమితి సభ్యుడు సీహెచ్.భీంరావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యాం, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు.


సీఎండీతో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

విద్యుత్ తీగపడి ఎద్దు మృతి

భీమారం: మండలంలోని దాంపూర్ గ్రామ సమీపంలోని మామిడి తోటలో గురువారం విద్యుత్ వైరు తెగి పడి ఎద్దు మృతిచెందింది. గ్రామానికి చెందిన చేగొండ నారాయణకు చెందిన ఎద్దు మేత కోసం తోటకు వెళ్తుండగా అకస్మాత్తుగా తీగ తెగిపోయి ఎద్దుపై పడింది. ఎద్దు విలువ రూ.50వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. విద్యుత్ శాఖ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి


మృతుడు రణధీర్(ఫైల్)

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి గ్రామంలో గురువారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతిచెందారు. ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. బాదన్‌కుర్తి గ్రామానికి చెందిన నువ్వుల రణధీర్ గ్రామంలోని పెట్రోల్ బంక్‌లో తన ద్విచక్రవాహనంలో పెట్రోల్ పోసుకుని రోడ్డు క్రాస్ చేస్తుండగా ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రణధీర్‌ను చికిత్స కోసం నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. రణధీర్ సోదరుడు రణవీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జూలై 10వరకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి

చెన్నూర్‌రూరల్: జూలై 10వరకు పనులు పూర్తి చేసి సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బలరాం అధికారులు, కాంట్రాక్టు కంపెనీని ఆదేశించారు. మండలంలోని శివలింగాపూర్ సమీపంలో మూతపడ్డ 2ఇంక్‌లెన్ గని ఆవరణలో 11మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ పనులను గురువారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ 76ఎకరాల్లో 11మెగావాట్ల సోలార్ పవర్‌ప్లాంట్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఎస్‌వోటు జీఎం పురుషోత్తమరెడ్డి, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, సోలార్ డీజీఎం శ్రీనివాస్, వర్క్‌షాప్ ఇంజినీర్ రాకేష్ పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న డైరెక్టర్, జీఎం

'అధికారుల నిర్లక్ష్యంతోనే కార్మికుడి మృతి'

పాతమంచిర్యాల: అధికారుల నిర్లక్ష్యంతోనే ఆర్జీ1 ఏరియాలోని 11 ఇంక్‌లెన్ గనిలో గురువారం ఎల్‌హెచ్‌డీ ఆపరేటర్ కార్మికుడు ప్రతాప్ మృతిచెందాడని సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జైపాల్‌సింగ్ ఆరోపించారు. కార్మికుడి మృతికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. గోదావరిఖని సింగరేణి ఆస్పత్రిలో మృతుడి కుటుంబాన్ని పరామర్శించి పార్థివ దేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. మృతుడి కుటుంబానికి కంపెనీ నుంచి అన్ని రకాల బెన్‌ఫిట్‌లు అందించాలని సింగరేణి ఆస్పతికి వచ్చిన సీఎండీ బలరాంనాయక్‌ను కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఉద్యోగుల సంఘం గోదావరిఖని ఏరియా ప్రచార కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు రాయపోషం, శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జైపాల్‌సింగ్

ముగిసిన సమ్మర్ క్యాంపు


రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో డీఎస్‌వోలు, కోచ్‌లు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా డీఎస్‌వో మీనారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతోపాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. ఆదర్శ క్రీడాపాఠశాలలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ఈ నెల 16 నుంచి 30 వరకు కొనసాగిందని తెలిపారు. మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన 60 మంది బాలికలు, 60 మంది బాలురు.. మొత్తం 120 మంది విద్యార్థులకు 12 రకాల క్రీడల్లో శిక్షణ అందించామని పేర్కొన్నారు. అథ్లెటిక్స్ విభాగం నుంచి ఆరుగురు బాలికలు, ముగ్గురు బాలురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జూన్, 6, 7 తేదీల్లో వరంగల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల డీఎస్‌వో జీవరత్నం, హెచ్ఎం కృష్ణారావు, కోచ్‌లు శ్రీనివాస్, విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, పీఈటీ, పీడీలు లక్ష్మణ్, శ్రీనివాస్, ఇందిర పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ మండలం బూర్గుడ బస్టాప్ వద్ద గురువారం నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు సీఐ సతీశ్ తెలిపారు. చింతలమానెపల్లి మండల కేంద్రానికి చెందిన పర్వాతాల ప్రశాంత్ వద్ద ఉన్న సంచిని అనుమానంతో తనిఖీ చేయగా.. సంచిలో 50 కేజీల నిషేధిత బీటీ– 3 విత్తనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటిని మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట్ మండలం కొత్తూర్‌కు చెందిన సురేశ్ వద్ద నుంచి పర్వాతాల ప్రశాంత్ కొనుగోలు చేశాడని తెలిపారు. విత్తనాలను ఎక్కువ ధరకు విక్రయించేందుకు తీసుకువస్తున్నట్లు నిందితుడు ఒప్పుకోవడంతో అతడి ఇంటి వద్ద కూడా తనిఖీ చేపట్టామన్నారు. ఈ సందర్భంగా మరో 4.50 క్వింటాళ్ల నిషేధిత విత్తనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటి విలువ రూ.12.50 లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. నిందితుడిపై సెక్షన్ 420, 34, 19 యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పట్టుకున్న విత్తనాలతో సీఐ సతీశ్

రూ.20 వేలు ఇచ్చేశారు

సాక్షి ఎఫెక్ట్..

వేమనపల్లి: 'ఇసుక ట్రాక్టర్ విడిచి పెడితే రూ.20వేలు' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనం అటవీ అధికారుల్లో గుబులు రేపింది. ప్రాణహిత నది నుంచి ఇసుకను కళ్లంపల్లి గ్రామ పంచాయతీ భవన అవసరాలకు ట్రాక్టర్‌లో తరలిస్తుండగా మంగళవారం అర్ధరాత్రి ఎఫ్ఎస్ఓ బేగ్, ఎఫ్‌బీఓ పోచయ్య, బేస్ క్యాంపు సిబ్బంది పట్టుకోవడం, ట్రాక్టర్ యజమానిని బెదిరించడం, వారి సూచనల మేరకు గురిజాల అంజన్న అనే వ్యక్తికి రూ.20 వేలు ఫోన్ పే చేయించుకోవడం తెలిసిందే. ఈ విషయం 'సాక్షి'లో ప్రచురితం కావడంతో తమ మెడకు చుట్టుకుంటుందనే ఉద్దేశంతో అంజన్న నుంచి రూ.20 వేలు తిరిగి ట్రాక్టర్ యజమాని చిరంజీవికి ఫోన్ పే చేయించారు. పైగా ట్రాక్టర్ యజమానిని మచ్చిక చేసుకునేందుకు రాజకీయ నాయకుల ద్వారా రాజీ కుదుర్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ట్రాక్టర్ యజమాని కోటపల్లి మండలం శీర్షకు చెందిన వాడు కాగా అక్కడి సర్పంచ్, సెక్షన్ అధికారితో సంప్రదింపులు జరిపించి రాజీ కోసం శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నారు.